www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
సోమవారం 20.01.2025



## హైదరాబాద్‌లో
# భారీ ఐటీ పార్క్

- రూ.450 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం
- 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి
- క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలు

**కలంజ్యోతి, హైదరాబాద్ :**
తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటన ఫలితమిస్తున్నది. రాష్ట్రంలో రూ.450 కోట్ల పెట్టుబడులకు అక్కడి క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకొచ్చింది. హైదరాబాద్ లో అత్యాధునిక ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సింగపూర్ కేంద్రంగా విస్తరించిన ఈ కంపెనీ ప్రపంచస్థాయి రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటి. హైదరాబాద్ లో 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సింగపూర్ లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో

మిగతా 4లో



## రాష్ట్రంలో డబుల్ ఇంజిన్
# సర్కార్ రావాలి

కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి

- అవినీతి రహిత పాలన కావాలంటే బీజేపీ రావాల్సిందే
- కేసుల నుంచి బయటపడేందుకు బీఆర్ఎస్ తంటాలు
- కాంగ్రెస్ 13 నెలల పాలనలోనూ అవే పరిస్థితులు

3లో



## కొమురెల్లి మల్లన్న
# జాతర షురూ

- సంక్రాంత్రి తర్వాత వచ్చిన తొలి ఆదివారం జాతర ప్రారంభం
- రెండున్నర నెలలపాటు కొనసాగనున్న జాతర
- ఉగాదికి వచ్చే ఆదివారంతో ముగింపు
- బ్రహ్మోత్సవాల్లో పట్నం వారం, లష్కర్ వారం, మహా శివరాత్రి రోజున నిర్వహించే పెద్దపట్నం, అగ్నిగుండాలు ప్రముఖ కార్యక్రమాలు
- తొలిరోజు పోటెత్తిన భక్తజనం

WANTED విలేకరులు కావలెను




'కలంజ్యోతి' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి, నాయకులకి మధ్య సమాచార వారధిగా, ప్రజా సమస్యల పరిష్కార దిశగా, పాఠకుల దిక్సూచిగా 'కలంజ్యోతి' పాఠకుల మన్ననలను పొందుతున్నది. మరింత నాణ్యమైన వార్త సమాచారాన్ని, వార్త ప్రపంచాన్ని విస్తరించడానికి ప్రజలకు అందించాలనే సంకల్పంతో నియోజకవర్గ, మండలాల వారీగా కంట్రీబ్యూటర్లు నియమించుకోవాలని భావిస్తున్నాము.

సెల్ : 9494 009 003

కలంజ్యోతి
సోమవారం 20.01.2025



# అర్హుల గుర్తింపు పకడ్బందీగా చేయండి

### నిర్మల్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

**కలంజ్యోతి, నిర్మల్ :**

ప్రభుత్వం ప్రారంభించనున్న నూతన పథకాల అర్హుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. కడం మండలంలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న పథకాల గుర్తింపు సర్వే తీరును ఆయన ఆదివారం పరిశీలించారు. మండలంలోని పెద్దూరు గ్రామ పరిధిలోని 69, 70, 71 సర్వే నెంబర్లలో సాగుకు యోగ్యం కానీ 87 ఎకరాలను గుర్తించి రైతుబంధు పథకం నిలిపివేసినట్టు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాల లబ్ధిదారుల గుర్తింపు సర్వేను ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి పలు కీలక సూచనలు జారీ చేశారు. గ్రామంలో నూతన ఆహార భద్రత కార్డుల లబ్ధిదారుల ఎంపిక క్షేత్రస్థాయి సర్వేలు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం లక్ష్మీ పూర్ లో రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించి, నిర్ణీత గడువులోగా లబ్ధిదారుల ఎంపిక సర్వే పూర్తి చేయాలని అధికారులను అదనపు కలెక్టర్ పలుకీలకు సూచనలు చేశారు. ఈనెల 21వ తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించి ప్రజలతో పథకాల గురించి చర్చించి, వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ సుజాత, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





# కొమురెల్లి మల్లన్న జాతర షురూ

**కలంజ్యోతి, కొమురవెల్లి :**



సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి జాతర వైభవంగా ప్రారంభమైంది. సంక్రాంతి తర్వాత వచ్చిన తొలి ఆదివారం జాతర ప్రారంభమవుతుంది. తొలివారం కావడంతో తమ కొంగు బంగారమైన కోర మీసాల మల్లన్నను దర్శించుకుంటున్నారు. రెండున్నర నెలలపాటు కొనసాగనున్న ఈ జాతర.. ఉగాదికి వచ్చే ఆదివారంతో ముగియనుంది. బ్రహ్మోత్సవాల్లో పట్నం వారం, లష్కర్ వారం, మహా శివరాత్రి రోజున నిర్వహించే పెద్ద పట్నం, అగ్నిగుండాలు ప్రముఖ కార్యక్రమాలు, ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి ఆదివారం బోనాలుఆలయంలో ప్రతి ఆదివారం విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు బోనాలతో ఆలయానికి వెళ్లి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తారు. పట్నం వేసి కల్యాణం జరిపించి మొక్కులు తీర్చుకుంటారు. పట్నం వారంతో ఉత్సవాలు ప్రారంభమై 12 ఆదివారాలు కొనసాగుతాయి. 12 ఆదివారాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు విశిష్ట దర్శనం, శ్రీఘ్రదర్శనం, ధర్మ దర్శనం కల్పించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పట్నం వారానికి ఆదివారం అధిక సంఖ్యలో హైదరాబాద్ భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్న పేరిట సట్టీ దీక్షలను 41 రోజుల చేపట్టి, పట్నం వారం స్వామిని దర్శించుకున్న అనంతరం, దీక్షను విరమిస్తారు. పట్నం వేసి గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పిస్తారు. ఈ నెల 20న స్వామి వారి కల్యాణ వేదిక వద్ద పెద్ద పట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని హైదరాబాద్ ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో ఆలయ వర్గాల పర్యవేక్షణలో నిర్వహిస్తారు.

# వైభవంగా మల్లన్న కల్యాణం

### ఘనంగా మేడాలమ్మ కేతమ్మ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం

### స్వామి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి: ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :**

జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ పొలాల బస్తిలో గల శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మేడాలమ్మ కేతమ్మ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కన్నుల పండుగగా జరిగిన మేడాలమ్మ కేతమ్మ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులకు నా అభినందనలు. స్వామివారి చల్లని కృపా కటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణుయాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, నాయకులు జైహింద్, పాపులు గౌడ్, నరసింహ, జయకృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షులు సుజిత్, ఉపాధ్యక్షులు రాజు, ట్రెజరర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.





# జంగుబాయి మాత ఉత్సవాలలో ఎమ్మెల్యే సత్యం



**కలంజ్యోతి, కొడిమ్యాల :** కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామంలో శ్రీజం గుబాయి మాత ఉత్సవాలలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం ఆలయా ప్రాంగణంలో మంచినీటి బోర్ వేయించినట్లు గుర్తు చేశారు. బోర్ ను సోమవారం ప్రారంభించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరీ నారాయణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు మెన్నేని రాజానార్సింగరావు, బండ రవీందర్ రెడ్డి, నాయకులు ముత్యం శంకర్, భూషణ్ రెడ్డి, మార్క శ్రీనివాస్, అజయ్ రెడ్డి, కవ్వం మధు, లడ్డు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
సోమవారం 20.01.2025 Local News




# రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణలో అవినీతి రహిత పాలన అందాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న, అవినీతి, నష్టాలకు, అక్రమాలకు, దోపిడీకి.. బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలే కారణమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి కుంభకోణాల్లో చిక్కుకుని కేసుల నుంచి బయటపడేందుకు తంటాలు పడుతుందన్నారు. ప్రజల్లో నానాటికి పలచనవుతున్న బీఆర్ ఎస్ నేతలు వారిపై పెట్టిన కేసులను అక్రమ కేసులంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. అందుకే రాష్ట్ర ప్రజానీకం బీజేపీని ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 8 పార్లమెంట్ స్థానాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆదివారం మధ్యాహ్నం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో వివిధ పార్టీలకు చెందిన కీలక నేతలు, కార్యకర్తలు కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో



బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంస పాలనతో పాటు 11నెలల కాంగ్రెస్ పాలన చూశామని కిషన్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్ నగరంలో చిన్న చిన్న రోడ్డు మరమ్మతు పనుల కాంట్రాక్టర్లు కు కూడా బిల్లులు, వీధి లైట్ల మరమ్మతు సిబ్బందికి జీతాలు ఇవ్వని పరిస్థితి కాంగ్రెస్ పాలనలో నెలకొందన్నారు. ఎక్సైజ్ శాఖ బిల్లులు మళ్లింపుతో చివరకు బీర్లు సరఫరా చేయలేని దుస్థితి నెలకొందన్నారు. రెండు పార్టీలు తెలంగాణను దోచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేశాయని తేటతెల్లమైందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో విఫలమైన ఆయా పార్టీలు పరస్పరం విమర్శలతో తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని ఆరోపించారు.

**మోదీ నాయకత్వంలో దేశ పురోగమనం!**

ప్రపంచమంతా యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాల బారిన పడితే ప్రధానీ మోడీ నాయకత్వంలో మన దేశం ఆర్థికంగా పురోగమిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. అందుకే తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సి ఉందన్నారు. రాహుల్ గాంధీ ఒకవైపు భారత రాజ్యం మీద పోరాటమంటూ రాజ్యాంగంపై పోరాటం చేస్తానంటున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలకు వంద రోజులు గడిచిపోయాయని, వాటిపై సమాధానం చెప్పాకే రాహుల్ గాంధీ తెలంగాణలో అడుగు పెట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయలేదో రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం, దళితులు, రైతులు, వృద్ధులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాజ్యాంగం పేరిట ఆందోళనలకు దిగుతున్నారన్నారు.



## చిత్తారమ్మదేవి అమ్మవారి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్‌రెడ్డి

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** గాజుల రామారం డివిజన్ చిత్తారమ్మ దేవాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న దేవాలయ స్వర్ణోత్సవ వేడుకల కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిత్తారమ్మ దేవి అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో , సుఖ సంతోషాలతో , అష్టైశ్వర్యాలతో జీవించాలన్నార అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, కోలన్ శ్రీనివాస్ రెడ్డి ,డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సిద్దనోల సంజీవరెడ్డి, పాల కృష్ణ, రాజేందర్ రెడ్డి, బల్ రెడ్డి, అవిజె హన్మంతు, శ్రీధర్ వర్మ, శ్రీకాంత్, వేణుగౌడ్, నరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాలుడి హత్యకేసు చేధింపు

### కేసులో నిందితుడి అరెస్టు

### లైంగికంగా వేధించి హత్య : ఏఎస్‌పీ రాజేష్ మీనా

**కలజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ రూరల్ మండలం చిట్యాల లో రిషి అలియాస్ ప్రశాంత్ హత్య కేసులో అసహజ శృంగారం జరిపి హత్య చేసిన నిందితుని అరెస్టు చేశామని నిర్మల్ ఎ ఎస్ పి రాజేష్ మీనా తెలిపారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బాలుని హత్యోదంతం సమాచారం అందిన వెంటనే ఎస్పీ జానకి షర్మిల స్వయంగా సంఘటన స్థలాన్ని సందర్శించారన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, సీసీఎస్ తో పాటు నాలుగు ప్రత్యేక టీం లను ఏర్పాటు చేశామన్నారు. నిందితుడు తోకల రాజేశ్వర్ ను అనుమానితుడిగా గుర్తించామన్నారు. తమ విచారణలో భాగంగా ప్రశ్నించినపుడు నేరస్తుడు నేరాన్ని అంగీకరించాడని వివరించారు.నిందితునికి అసహజ శృంగారం అలవాటుందని పేర్కొన్నారు. కామవాంఛ తీర్చుకోవటం కోసం 17న అర్ధ రాత్రి మృతునిపై అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. ఈ విషయం బయట పడకుండా మద్యం మత్తులో బాలున్ని బండరాయి తో కొట్టి హత్య చేసాడన్నారు. నిందితుని రిమాండ్ కు పంపించామని వివరించారు. కాగా ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి కొన్ని గంటల్లోనే నిందితుని పట్టుకున్న ఎ ఎస్పీ రాజేష్ మీనా,జిల్లా డాగ్ స్క్వాడ్, క్రైం టీం,అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రామ కృష్ణ, సిసిఎస్ ఇన్స్పెక్టర్ కృష్ణ , ఎస్ఐ లు లింబాద్రి, సందీప్, సాయి కిరణ్ లను జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

## నేడు డప్పుల ప్రజా ప్రదర్శన

**కలంజ్యోతి, నర్సంపేట :** నేడు నర్సంపేట పట్టణంలో నిర్వహించనున్న డప్పుల ప్రజా ప్రదర్శను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు తడుగుల విజయ్ మాదిగ కోరారు. నర్సంపేట పట్టణం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద డప్పు కళాకారుల డివిజన్ అధ్యక్షుడు అబ్బదాసి యాకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దళిత రత్న కళ్లెపెల్లి ప్రణయ్ దీప్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ మాదిగ హాజరయ్యారు. సోమవారం వరంగల్, హనుమకొండ సంయుక్త జిల్లాలోని వేయి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు డప్పుల ప్రజా ప్రదర్శన జరుగుతుందన్నారు. ప్రజా ప్రదర్శనకు ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమ ప్రతినిధులు మునిగే యాకయ్య మాదిగ, డప్పు కళాకారుల నర్సంపేట ఇంచార్జ్ కొలకనూరు నిరంజన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు డప్పు కళాకారుల కన్నం మదర్ మాదిగ, అబ్బదాసి అశోక్, కన్నం కుమార్, గుండె చంటి, జన్ను శ్రీకాంత్, కన్నం సతీష్, అబ్బదాసి అశోక్, అబ్బదాసి సాగర్, జన్ను శ్రీను, సాంబయ్య, బొక్కల శేఖర్ పాల్గొన్నారు.





# హైదరాబాద్‌లో భారీ ఐటీ పార్క్

- రూ.450 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం
- 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి
- క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలు

» మొదటిపేజీ తరువాయి

క్యాపిటల్ ల్యాండ్ ఈ నిర్ణయం ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, సీఎంవో స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ తరఫున ఇండియా ట్రస్ట్ మేనేజ్మెంట్ సీఈవో గౌరీ శంకర్ నాగభూషణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ క్యాపిటల్ ల్యాండ్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు.. క్యాపిటల్ ల్యాండ్ నిర్ణయాన్ని స్వాగతించారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల కు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలను ఈ ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయని చెప్పారు. గౌరీ శంకర్ నాగభూషణం మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిరంగా వృద్ధి చెందుతుందనీ తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందన్నారు. కాగా క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్ లో అంతర్జాతీయ టెక్ పార్క్, అవాన్స్ హైదరాబాద్, సైబర్‌పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలోనే అందుబాటులోకి వస్తుంది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానుంది.

# కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఢిల్లీ ఎన్నికలు నిదర్శనం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు, కపట చేష్టలకు నిదర్శనంగా నిలిచాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇండియా కూటమిలో చేరి.. కాంగ్రెస్ తో జతకట్టినప్పుడు ఆప్ పార్టీ నీతివంతమని..కేజ్రీవాల్ తెలివైన, స్వచ్ఛమైన నాయకుడని కాంగ్రెస్ ప్రశంసించిందని గుర్తు చేశారు. ఇప్పుడు కేజ్రీవాల్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా నిలబడాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో అతను కాంగ్రెస్ కు దోషిగా..నేరస్థుడుగా, ఢిల్లీ ఒక డంప్ గా కనిపిస్తుందని ఆదివారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. అకస్మాత్తుగా ఆప్ అవినీతిపార్టీగా మారిపోయిందని విమర్శించారు. ఈ నాటకీయ మార్పు కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు పాఠ్యపుస్తకం లాంటి ఉదాహరణ అని..వారు ఇంత త్వరగా తమ ట్యూన్‌ను ఎలా మార్చగలిగారన్నది ఆశ్చర్యంగా ఉందని కాంగ్రెస్ తీరును ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ తెలంగాణలో పర్యటించి ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన హామీలు అమలు అయ్యాయా..? లేదా..? అని తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో హామీల అమలు తీరుపై విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులతో మాట్లాడాలని డిమాండ్ చేశారు.

# పథకాలపై అవగాహన కల్పించండి

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



కలంజ్యోతి, నిర్మల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నూతన పథకాల లబ్ధిదారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి నూతన పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వే, గ్రామ, వార్డు సభలు, పథకాల అమలుపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో కలిసి కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు జరుగకుండా నిర్దేశిత గడువులోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. రోజువారీగా నిర్వహించిన సర్వే వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని తెలిపారు. సర్వే సమయంలో ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని తెలిపారు. సర్వేలో పేర్లు లేని వారిని ప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తులు చేసుకునేలా సూచించాలన్నారు. మండల స్థాయి ఉద్యోగులంతా ఎప్పటికప్పుడు సర్వే తీరును పర్యవేక్షించాలన్నారు. ఈనెల 21 నుండి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజల నుంచి పథకాలపై సలహాలు సూచనలు స్వీకరించాలన్నారు. ఈ పథకాల మంజూరు ఏక కాలానికి మాత్రమే పరిమితం కాదని, పథకాల అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రజలకు తెలపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిసిఎస్ఓ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, వ్యవసాయ అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### నేటి ప్రజావాణి రద్దు..

సమగ్ర సర్వేలో భాగంగా అధికారులు నిమగ్నమై ఉన్న కారణంగా సోమవారం జరగాల్సిన ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



# రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి

## వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

## సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం ఓవరాల్ ఛాంపియన్

**కలంజ్యోతి, వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ వార్షిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025లో సిటి ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం 125 పతకాలను గెలుచుకోని ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించగా, ఈస్ట్ జోన్ 51, సెంట్రల్ జోన్ 50, వెస్ట్ జోన్ 19, ఇతర విభాగాల జట్టు 21 పతకాలను గెలుచుకున్నారు. ఈ నెల 17నుంచి మూడు రోజుల పాటు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న వరంగల్ కమినరేట్ పోలీసుల క్రీడలు ఆదివారం విజయవంతంగా ముగి శాయి. క్రీడల ముగింపు వేడుకలకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ జట్టు, డీసీపీ అధికారుల జట్ల మధ్య నిర్వహించిన టంగ్ ఆఫ్ వార్ పోటీ నిర్వహించగా సీపీ జట్టు 2.1తో విజయం సాధించింది. అనంతరం ఈ క్రీడల్లో విజయం సాధించిన పోలీస్ క్రీడాకారులకు సీపీ బహుమతి ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విధి నిర్వహణలో ఉండే పోలీసులకు ఈ క్రీడలు ఉల్లాసాన్ని కలిగించాయన్నారు. ఈ క్రీడల్లో రాణించడం ద్వారా దేహదారుఢ్యంతో పాటు, ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు ఇక్కడ ఏ స్థాయిలో క్రీడల్లో తమ ప్రతిభ కనబరచారో అదేస్థాయిలో త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయిలో పోలీస్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలను సాధించాలని సూచించారు. కార్యక్రమములో డీసీపీలు షేక్ సలీమా, రాజ మహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, ఏఎస్పీ చేతన్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు,ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీపై నాన్ బెయిలబుల్ ఎఫ్ఐఆర్ నమోదు!

డిస్పూర్: రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలపై అసోంలో నాన్ బెయిలబుల్ ఎఫ్ ఐఆర్ నమోదైందని గౌహాతి హైకోర్టు న్యాయవాది మోంజీత్ చెటియా ఆదివారం తెలిపారు. శనివారం గౌహాతి లోని పాన్ బజార్ పోలీస్ స్టేషన్ లో నమోదైందన్నారు. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రత కు హాని కలిగించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో బీఎన్ఎస్ సెక్షన్ 52 కింద నాన్ బెయిలబుల్ ఎఫ్ ఐఆర్ నమోదైందన్నారు. రాహుల్ బెయిల్ కోసం నేరుగా కోర్టుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ నూతన జాతీయ కార్యాలయ భవనం ప్రారంభం అనంతరం రాహుల్ గాంధీ ఆర్ఎస్ఎస్, బీజేపీపై తీవ్ర విమర్శలకు పాల్పడ్డారు. పదేపదే కాంగ్రెస్ పార్టీ ఓటమితో రాహుల్ తీవ్ర నిర్వేదంలో ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా కనిపిస్తుందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా, శాంతి, సుస్థిరతలను, ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉన్నాయని న్యాయవాది వ్యాఖ్యానించారు.

Cinema కలంజ్యోతి
సోమవారం 20.01.2025



# అతడు ఎప్పటికీ నాకు ప్రత్యేకమే!

స్టార్ హీరోయిన్ త్రిష గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'వర్షం' మూవీతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. తన ఫస్ట్ సినిమాతోనే మంచి ఫేమ్ తెచ్చుకుంది. దాంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించి వావ్ అనిపించుకుంది. అయితే సడెన్‌గా కొన్నేళ్లు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. కానీ, ఇప్పుడు మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చి.. యంగ్ హీరోయిన్స్‌కి గట్టి పోటీ ఇస్తుంది. ప్రస్తుతం ఈ భామ చేతిలో 8 సినిమాలకు పైనే ఉన్నాయి. ఇక ఈ బ్యూటీ వ్యక్తిగత విషయానికి వస్తే ఇప్పటికీ పెళ్లి చేసుకోకుండా సింగిల్‌గానే ఉంటుంది. ఈ క్రమంలో త్రిష చాలా మందితో డేటింగ్‌లో ఉందని చాలా రూమర్స్ వచ్చిన సంగతి తెలిసిందే. అలా పుకార్లు వచ్చిన వారిలో హీరో విజయ్ దళపతి ఒకరు. త్రిష- విజయ్ జంటగా 'లియో' సినిమాలో నటించారు. అలాగే విజయ్ నటించిన 'గోట్' మూవీలో త్రిష ఇప్పటివరకు ఎన్నడూ చేయని సాహసం చేసి అతని మూవీలో స్పెషల్ సాంగ్ చేసింది. దాంతో వీరిద్దరి మధ్య ఏదో సంథింగ్ సంథింగ్ నడుస్తుందని అందరూ అనుకున్నారు. అంతే కాదు వీరిద్దరు రీసెంట్‌గా కీర్తి సురేశ్ ఆంటోని తటిల్ పెళ్లికి వెళ్తున్న టైంలో ఎయిర్ పోర్ట్‌లో కెమెరాకి కూడా చిక్కారు. దాంతో నిజంగానే వీరిద్దరి మధ్య ఏదో ఉందని అందరూ ఫిక్స్ అయిపోయారు. ఈ క్రమంలో ఈ ముద్దుగుమ్మ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న త్రిష కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పై ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'నేను దళపతి విజయ్‌కి ప్రత్యేక అభిమానిని. ఆయన ఎప్పటికీ నాకు ప్రత్యేకమే. విజయ్ చాలా లవబుల్ పర్సన్, అతడితో వర్క్ చేయడం ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అంటూ త్రిష.. విజయ్ పై ఉన్న ప్రేమను చెప్పకనే చెప్పింది. ప్రస్తుతం ఈ భామ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.